క్లుప్తంగా

నిబంధనలు అతిక్రమించొద్దు..

వైరా: వినాయక నిమజ్జనంలో నిబంధనలు అతిక్రమిస్తే ఉత్సవ కమిటీ సభ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని వైరా ఎస్సై వంశీకృష్ణ భాగ్యరాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శోభాయాత్రలో ఎటువంటి అవంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్న ఉత్సవ కమిటీ సభ్యులు బాధ్యత వహించాలని వివరించారు. అశ్లీల నృత్యాలు, మత విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యల పాటలను ప్రదర్శిస్తే చట్టారీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే నిమర్జన సమయంలో తగు జాగ్రత్తలు పాటించి పోలీస్ వారికి సహకరించాలని తెలిపారు.

గ్రామ పంచాయతీ కార్యదర్శికి సన్మానం



కార్యదర్శి శ్రీరామ్‌కుమార్‌ను సన్మానిస్తున్న గ్రామపెద్దలు

చింతకాని: మండలంలోని లచ్చగూడెంలో ఇటీవల బదిలీపై వెళ్లిన గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీరామ్‌కుమార్‌ను ఆదివారం గ్రామపెద్దలు సన్మానించారు. శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి శ్రీరామ్‌కుమార్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు గోవిందరావు, హనుమంతురావు, ఝాన్సీ, సైదేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రైలుకు హాల్టింగ్ కల్పించాలి



కర్నాటక ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలుకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని ఖమ్మం పట్టణంలో బీజేపీ సభ్యత్వాల నమోదు కార్యక్రమానికి విచ్చేసిన తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్, కర్నాటక ఎమ్మెల్యే అభయ్‌పాటిల్‌కు ఆదివారం బీజేపీ మండల కమిటీ అధ్యక్షులు నూతక్కి నర్సింహారావు, దళిత మోర్చా జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి దేవరకొండ కోటేశ్వరరావులు వినతిపత్రం అందజేశారు. సమస్య తీవ్రతను రైల్వే మంత్రి, రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు మేకపోతుల పుల్లారావు, కన్నా రామకృష్ణ తదితరులున్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి

ముదిగొండ: మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం చెందాయని ఐద్వా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు బుగ్గవీటి సరళ అన్నారు. ముదిగొండలోని మచ్చావీరయ్య భవనంలో ఆదివారం జరిగిన అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం మండల మహాసభలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్రాల్లో ప్రతి మహిళ ఏదో చోట వివక్షతకు గురౌతుందని ఆరోపించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక..



ఎన్నికైన ఐద్వా మండల అధ్యక్ష, కార్యదర్శులు పద్మావతి, అరుణ

ఐద్వా మండల మహాసభల సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముదిగొండ మండల అధ్యక్షురాలిగా ముదిగొండకు చెందిన మందరపు పద్మావతి, కార్యదర్శిగా చిరుమర్రికి చెందిన కోలేటి అరుణ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 19మంది సభ్యులతో కార్యవర్గం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకురాలు పయ్యావుల ప్రభావతి, మండల నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

కల్లూరు: మండలంలో ఉన్న ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలు, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యను అభ్యసిస్తున్న విద్యార్థిని, విద్యార్థులకు కల్లూరు మండలస్థాయి ఆటల పోటీలు నిర్వహించడం జరుగుతుందని ఎంఈఓ దామోదర ప్రసాద్ పేర్కొన్నారు. 19వ తేదీ బాలికలకు, 20న బాలురకు నిర్వహించడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు 9440669401 నంబర్‌ను సంప్రదించాల్సిందిగా కోరారు.

నిమజ్జన వేళ.. జాగ్రత్త సుమా..

అప్రమత్తతతోనే ప్రశాంత నిమజ్జనం

సత్తుపల్లిటౌన్: గణపతి నవరాత్రి ఉత్సవాలు వాడవాడలా ఉత్సాహంగా జరుగుతున్నాయి. దీంతో ఉత్సవ కమిటీలు నిమజ్జన వేళ అప్రమత్తంగా లేకపోతే విషాదం జరిగే అవకాశం ఉంది. ఊరేగింపు సమయంలో చెరువులు, కాలువల వద్ద జాగ్రత్తలు పాటించడం ఎంతో అవసరం. సోమవారం నిమజ్జనోత్సవాలు జరుపుకునేందుకు ఏర్పాట్లు పూర్తిఅయ్యాయి. ఎలాంటి విఘ్నాలు ఎదురుకాకుండా నిమజ్జనాలు జరిగేలా ఉత్సవ కమిటీ చొరవ తీసుకోవాలి. పోలీస్, రెవెన్యూ, విద్యుత్ శాఖల అధికారులు ఇచ్చే సూచనలు పాటిస్తే ప్రశాంత నిమజ్జనానికి అవకాశం ఉంటుంది.



సత్తుపల్లి తామరచెరువులో వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న కమిటీ సభ్యులు

వాహనంపై ఎక్కించేటప్పుడు..

- విగ్రహాలను సైజును బట్టి వాహనంపై ఎక్కించటం కష్టం. ఎక్కువ సంఖ్యలో భక్తులు ఉండాలి. వీలైతే క్రేన్ల సహాయంతో ఎక్కించాలి.
- ప్రతి వాహనంలో ప్రథమ చికిత్స కిట్లు ఉండాలి. మార్గమధ్యలో రహదారికి అడ్డంగా కిందకు వేలాడుతూ ఉండే విద్యుత్ తీగల వద్ద తగిన జాగ్రత్తలు అవసరం.
- మద్యం, మత్తు పదార్థాల జోలికి పోవద్దు. గోడవలకు ఆస్కారం ఇవ్వవద్దు.
- ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలి.

శోభాయాత్రలో..

- గణనాథుల ఊరేగింపులో డీజేలకు అతిదగ్గరగా ఉండకూడాదు. శబ్దంతో గుండె లయతప్పే ప్రమాదం ఉంది.
- ప్రమాదకర నృత్యాలు వద్దు. రహదారి పక్కన ఉండే భవనాలపై చివర్లో కూర్చొని, నొల్చొని ఉత్సవాలు తిలకించటం ప్రమాదకరం.
- జనరేటర్ నిర్వాహణలో జాగ్రత్తగా ఉండాలి.
- చీకటి పడక ముందే నిమజ్జనం చేసేలా ప్రణాళిక రూపొందించాలి.
- ఊరేగింపు చేసేటప్పుడు అడ్డుగా ఉన్న విద్యుత్ తీగలను పైకి ఎత్తే సమయంలో ఎండిన కర్రలనే వినియోగించాలి.

నిమజ్జన సమయంలో..

- విగ్రహాలను నిమజ్జనం చేసే సమయంలో ఈత వచ్చినవారు మాత్రమే నీటిలోకి దిగాలి.
- చెరువు కట్టలపై వాహనాలతో వెళ్లేటప్పుడు దిగబడుతుందో లేదో చూసుకుంటూ విగ్రహాలు ఒరగకుండా గమనిస్తుండాలి.
- ఈతరాని వారు చెరువులు, కాలువలకు దూరంగా ఉండాలి.
- లోతు అంచనా వేయకుండా లోనికి వెళ్లవద్దు.
- నిమజ్జనం చేసే సమయంలో విగ్రహం ముందు, కింద, వెనుక వైపు భాగాల్లో ఎవరూ ఉండొద్దు.



బేతుపల్లి చెరువువద్ద సిద్ధం చేసిన భారీ క్రేన్

- క్రేన్ సహాయంతో విగ్రహాలను నీటి వనరుల్లో నిమజ్జనం చేయాలి.
- చిన్న పిల్లలను, యువకులను పెద్దలు కనిపెడుతూ ఉండాలి. అనుకోని సంఘటనలు జరిగితే వెంటనే 100, 108కు కాల్ చేయాలి.

అన్ని ఏర్పాట్లు చేశాం..



సత్తుపల్లిలోని విగ్రహాల నిమజ్జనం చేసేందుకు స్థానిక తామర చెరువు వద్ద అన్ని ఏర్పాట్లు చేశాం. లైటింగ్ ఏర్పాటు చేసి, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాం. పారిశుద్ధ్య నిర్వాహణకు సిబ్బందిని నియమించాం. తాగునీటి సదుపాయాన్ని ఏర్పాటు చేశాం.

– ఎం.రవిబాబు, మున్సిపల్ కమిషనర్, సత్తుపల్లి

శాంతియుతంగా నిర్వహించేలా..



గణేష్ నిమజ్జనోత్సవాలు సత్తుపల్లి డివిజన్‌లో శాంతియుతంగా నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. డివిజన్‌లో 445 విగ్రహాలను జీయో ట్యాగింగ్‌కు అనుసంధానం చేశాం. బేతుపల్లి చెరువువద్ద క్రేన్‌తో పాటు బారీకేట్స్, గజ ఈతగాళ్ల, ప్రత్యేక బృందాలను సిద్ధం చేశాం.

– ఎ.రఘు, ఏసీపీ, సత్తుపల్లి

వరద బాధితులకు సాయంగా..

వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

వైరా: వైరా లయన్స్‌క్లబ్ గ్రేట్ విజన్, లయన్స్ ఇంటర్నేషన్ ఫండ్ ఆధ్వర్యంలో ఇటీవల వర్షాలకు వైరాలోని వివిధ ప్రాంతాల్లో ఇళ్లు కోల్పోయిన వారికి ఆదివారం వైరాలోని దత్తసాయి కల్యాణ మండపంలో రూ.90 వేలు విలువ చేసే నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ పాస్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, కోఆర్డినేటర్ ఉంద్రూ శ్యాంబాబు, చింతలపూడి వెంకటేశ్వరరావు, తోటకూర శ్రీకాంత్, పెనుగొండ ఉపేందర్ రావు, లగడపాటి ప్రభాకర్‌రావు, అబ్బూరి రమేష్, మరికంటి రాంగోపాల్, చింతోజు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల చేయూత..



ఆశావర్కర్లకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఏన్కూరు: ఖమ్మంలో వరదలకు నష్టపోయిన ఆశావర్కర్లకు ఏన్కూరు మండల ఆశావర్కర్లు చేయూతనిచ్చారు. మండల ఆశావర్కర్ల యూనియన్ అధ్వర్యంలో ఆదివారం చీరలు, దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆశావర్కర్స్ జిల్లా యూనియన్ కార్యదర్శి బానోత్ అమల, ఇనపనూరి అనురాధ, రజిత, స్వాతి, భవాని, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

విరాళాల సేకరణ

టైలర్స్ యూనియన్ ఆధ్వర్యంలో..



విరాళాలు సేకరిస్తున్న మహిళా టైలర్లు

సత్తుపల్లి: ఖమ్మం మున్నేరు వరద బాధితుల సహాయార్థం సత్తుపల్లి లేడీస్ టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన పట్టణంలో విరాళాల సేకరణ నిర్వహించారు. రూ.46వేల నగదుతో పాటు దుస్తులు, నిత్యావసర సరుకులను ఖమ్మంలో ఐద్వా బాధ్యులు మాచర్ల భారతి, బుగ్గవీటి సరళ, బండి పద్మ చేతుల మీదుగా బాధితులకు పంపిణీ చేశారు.

పల్లిపాడు ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో..

కొణిజర్ల: వరద బాధితుల కోసం మండలంలోని పల్లిపాడు ఫ్రెండ్స్ యూత్ వారు సేకరించిన విరాళాలను వార్డు ఆఫీసర్ మురళీ కృష్ణ చేతుల మీదుగా వైరా మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వేణుకు అందజేశారు. ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో దుస్తులు, వంటగిన్నెలు, నగదు గత వారం రోజులుగా స్వీకరించి వాటిని ఆదివారం కమిషనర్‌కు అందించారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ యూత్ అధ్యక్షుడు తాటిపల్లి సుధీర్, సభ్యులు కోటేశ్వరరావు, మోహనరావు, అప్పారావు, కృష్ణయ్య, సైదులు, నరసింహారావు, కార్తీక్, యశ్వంత్, వేణు, గోపాల్, కౌశిక్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నియామకం



రాములును అభినందిస్తున్న పీసీసీ అధ్యక్షుడు

వైరా: మిషన్ భగీరథ, ఆర్ డబ్ల్యుఎస్, ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టర్స్ వర్కర్స్ మరియు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా కొణిజర్ల మండలానికి చెందిన తలారి రాములును ఎన్నుకున్నట్లు ఐఎన్‌టీయూసీ ఆర్గనైజింగ్ జాతీయ సెక్రటరీ యరగాని నాగన్న ఆదివారం ఒకప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఆయనకు నియమక ఉత్తర్వులను జారీ చేశారు. అనంతరం కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.

పీఆర్‌టీయూ మండల కమిటీ ఎన్నిక



యూనియన్ అధ్యక్ష కార్యదర్శులుగా సత్యనారాయణరెడ్డి, సుధాకర్

మధిర: మధిర మండల పీఆర్‌టీయూ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక టీవీఎం పాఠశాలలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. యూనియన్ మండల అధ్యక్షుడిగా చిలుకూరి సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పోలె సుధాకర్, అసోసియేట్ అధ్యక్షులుగా మహమ్మద్ జమీర్, ఎల్ అప్పారావు, గౌరవాధ్యక్షుడిగా పిల్లి నరసింహారావులు ఎన్నికయ్యారు. అదేవిధంగా ఉపాధ్యక్షులుగా కె.శాంతబాబు, తెల్లమేకల శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మల్లెల శ్రీనివాస్, మహిళా ఉపాధ్యక్షురాలిగా జ్యోతి, మహిళా కార్యదర్శిగా అనసూయ, కార్యదర్శులుగా బాబురాజ, చేడే సతీష్, అజయ్ కుమార్, నాగేశ్వరరావు, జిల్లా కౌన్సిలర్లుగా తూమాటి కృష్ణారెడ్డి, పురం సంగారావు ఎన్నికయ్యారు.


సభను విజయవంతం చేయండి



దండు ఆదినారాయణ

సత్తుపల్లిరూరల్: తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా యాతాలకుంటలో సోమవారం జరిగే సభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం సత్తుపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సభకు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సింగు నర్సింహారావు పాల్గొంటారని తెలిపారు.

సీతారాం ఏచూరి మరణం తీరని లోటు




మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యుడు వెంకటేశ్వరరావు

బోనకల్: సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టులకు తీరని లోటని సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని చొప్పకట్లపాలెంలో ఆపార్టీ సంతాభ సభలో ఆయన పాల్గొన్నారు. అనంతరం సీపీఎం సీనియర్ నాయకుడు చలమల హరికిషన్‌రావు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం ప్రస్తుతం అనుసరిస్తున్న మతరాజకీయాలు దేశానికి ప్రమాదకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీపై రైతులను మభ్యపెడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కోటేశ్వరావు, నాగేశ్వరావు, సురేష్, పున్నయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

కారేపల్లి: మండలంలోని చీమలపాడు రోడ్డు మూలమలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తాకొట్టింది. ఈ ఘటనలో మాధారం మైన్‌ హోంగార్డుకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..భద్రాద్రికొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం కొమ్ముగూడెం గ్రామానికి చెందిన చందర్ మండలంలోని మాధారం డోలమైట్ మైన్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. కాగా.. ఖమ్మంలో డ్యూటీ వేయటంతో చందర్ తన ద్విచక్ర వాహనంపై విధులకు హాజరైయ్యేందుకు మాధారం నుంచి చీమలవారిగూడెం మీదుగా ఖమ్మం వెళ్తున్నాడు. ఈ క్రమంలో చీమలవారి గూడెం గ్రామం వద్ద ఉన్న అత్యంత మూలమలుపు వద్ద ద్రిచక్రవాహనం అదుపుతప్పడంతో రోడ్డుపై హోంగార్డు చందర్ పడిపోవటంతో..తలకు తీవ్ర గాయమైంది. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, 108 అంబులెన్స్ ద్వారా ఖమ్మం ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు.

‘మిస్ట్’లో ఇంజనీర్స్ డే వేడుకలు



మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సత్తుపల్లిరూరల్: స్థానిక మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఇంజనీర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాలలోని విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చలసాని హరికృష్ణ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, చైర్మన్ కంచర్ల సత్యనారాయణ, జాకీర్‌హుస్సేన్, రామచంద్రరావు, సాయి ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

స్విమ్మింగ్ ఘాట్, కట్టమైసమ్మ గ్రిల్స్ ప్రారంభం



మధిర స్విమ్మర్స్ అసోసియేషన్ సభ్యులతో సీఐ మధు

మధిర: మధిర స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ ఘాట్, కట్టమైసమ్మకు చుట్టూ ఏర్పాటు చేసిన గ్రిల్స్‌ను మధిర సీఐ మధు, ఇరిగేషన్ సబ్ డివిజనల్ ఇంజనీర్ నాగ బ్రహ్మయ్య ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మధిర స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యులందరూ కలిసి స్విమ్మింగ్ ఘాట్‌ను ఏర్పాటు చేసుకుని ప్రతిరోజు వ్యాయామంలో భాగంగా స్విమ్మింగ్ చేస్తూ పిల్లలకు, పెద్దలకు ఈత నేర్పిస్తూ సమాజ సేవలో కూడా మేముసైతం అంటూ ఉత్సాహంగా పనిచేస్తున్న అసోసియేషన్ సభ్యులను అభినందించారు. అనంతరం సీఐ, ఇరిగేషన్ డీఈ లను స్విమ్మింగ్ అసోసియేషన్ సభ్యులు శాలువాలతో సన్మానించారు. కట్టమైసమ్మ చుట్టూ గ్రిల్స్‌ను ఏర్పాటు చేసిన దాతలు బద్దం రాంరెడ్డి జ్ఞాపకార్థం మునగాల శశికళ-తిరుపతి రెడ్డి దంపతులు, వారి కుమారుడు రాజ కారుణ్యరెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మధిర స్విమ్మర్స్ అసోసియేషన్ సభ్యులు, కలయిక వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం



నారాయణపురంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

తల్లాడ: తల్లాడ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నారాయణపురం కోదండ రామాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 60 మందికి షుగర్ పరీక్షలు చేయగా.. ముగ్గురికి షుగర్ ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ అధ్యక్షులు బెల్లంకొండ ఆంజనేయులు మాట్లాడుతూ.. షుగర్ ఉన్నవారు స్థానిక పీహెచ్‌సీలో చికిత్స చేయించుకొని తగిన మందులు వాడాలని, ప్రతి గ్రామంలో షుగర్ వ్యాధి పరీక్షలు చేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీసీ పులబాల వెంకటేశ్వర్లు, వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, శీలం వెంకట్‌రెడ్డి, రెడ్డెం రామకృష్ణారెడ్డి, వేమిరెడ్డి సీతారామిరెడ్డి, దేవిశెట్టి వెంకటరమణ పాల్గొన్నారు.

సిరిపురంలో..



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

వైరారూరల్: మండలంలోని కేజీ సిరిపురంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ప్రారంభించారు. అనంతర వైద్యులు గ్రామంలోని పలువురికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మట్టూరి కృష్ణారావు, మోరంపూడి బాబు, మోరంపూడి ప్రసాద్, సాగినేని నాగేశ్వరరావు, నారపోగు కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ నిర్మాణం ఆపాలి



సెల్ టవర్ వద్ద ధర్నా చేస్తున్న స్థానికులు

మధిర: మధిర పట్టణంలోని స్థానిక లడక్ బజార్ అయ్యప్ప నగర్‌లోని ఒక ప్రైవేట్ పాఠశాల వెనుక నివాస గృహాలకు సమీపంలో చేపట్టిన ఎయిర్‌టెల్ నూతన సెల్ టవర్ నిర్మాణాన్ని ఆదివారం స్థానికులు అడ్డుకొని ధర్నా నిర్వహించారు. మూడు రోజులపాటు వచ్చిన సెలవులను ఆసరాగా తీసుకున్న సెల్ టవర్ నిర్మాణదారులు గుట్టు చప్పుడు కాకుండా సెల్ టవర్ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు పనులు చేపట్టారు. దీనిని గమనించిన స్థానికులు టవర్ నిర్మాణాన్ని అడ్డుకున్నారు. మాకు అన్ని అనుమతులు ఉన్నాయని, టవర్ నిర్మాణాన్ని అడ్డుకుంటే నాన్ బెయిల్‌బుల్ కేసులు పెడతామని టవర్ నిర్మాణ నిర్వాహకులు స్థానికులను బెదిరించడం గమనార్హం. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు అక్కడికి చేరుకుని సెల్ టవర్ నిర్మాణదారులతో మాట్లాడి వెంటనే టవర్ నిర్మాణ పనులను నిలిపివేయాలని స్థానికుల అనుమతి లేకుండా ఇచ్చిన అనుమతులను సెలవులు పూర్తయిన వెంటనే స్థానిక మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి నిలిపివేయించేందుకు కృషి చేస్తామని, అప్పటివరకు ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని హెచ్చరించారు. టవర్ నిర్మాణాన్ని అడ్డుకున్న వారిలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ కార్యదర్శి అరిగె శ్రీనివాసరావు, 17వ వార్డు కౌన్సిలర్ మునుగోటి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు దేవిశెట్టి రంగారావు, టీడీపీ నాయకులు మేదరమెట్ల నవీన్, కట్టా నరసింహారావు, స్థానిక మహిళలు ఉన్నారు.

గణనాథుడికి ప్రత్యేక పూజలు

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సత్తుపల్లి, మధిర, వైరా నియోజకవర్గాల్లోని గణనాథుడి మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమాలను పలువురు నాయకులు, అధికారులు ప్రారంభించారు. అదే విధంగా పలు గ్రామాల్లో గణపతి లడ్డూ వేలం నిర్వహించడంతో పాటు వినాయకుడిని ఊరేగించి నిమజ్జనం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



వైరా: అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అమ్మ ఫౌండేషన్ చైర్‌పర్సన్ మల్లు నందిని



సత్తుపల్లిటౌన్: జలగంనగర్‌లో అన్నదానం చేస్తున్న మట్టా దయానంద్, సీఐ కిరణ్



వైరారూరల్: వేలం పాటలో దక్కించుకున్న లడ్డూతో మీరా సాహెబ్



ముదిగొండ: అయ్యగారిపల్లిలో..



కొణిజర్ల: ఎస్‌బీఐ సెంటర్‌లో కూరగాయలతో అలంకరించిన గణపతి విగ్రహం



తల్లాడ: కుర్నవల్లి యూత్ ఆధ్వర్యంలో..



ఎర్రుపాలెంలో..